

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## రూ.5లక్షలు ప్రమాదబీమా అందజేసిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** పట్టణంలోని 9వ వార్డుకు చెందిన దివంగత టిడిపి కార్యకర్త చెబ్రోలు పురుషోత్తంరావు కుటుంబానికి టిడిపి ప్రమాదభీమా పథకం కింద రూ.5లక్షలు మంజూరు కావడం జరిగింది. స్తానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐటిశాఖమంత్రి నారాలోకేష్ సహకారంతో మంజూరైన ఈ భీమా పత్రాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నామినీ అయిన భార్య చెబ్రోలు ఊర్మిళకు అందజేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుషోత్తంరావు పార్టీకి కష్టపడి, పార్టీ బలోపేతానికి కృషి చేశాడని కొనియాడారు. పార్టీకోసం పనిచేసిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు వివిద ప్రమాదాల్లో మరణించిన 11మంది పార్టీ సభ్యుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ.5లక్షలుచొప్పున అందజేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, మాజీ సోమశిల ఛైర్మెన్ కండ్లగుంట మదుబాబునాయుడు, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు చక్రి తదితరులు పాల్గొన్నారు.

## మొహరం ఉత్సవాలకు మేకపాటి ఆర్థిక సాయం



**ఉదయగిరి, జూన్ 23, ప్రభాతవార్త** జూన్ 26న జరగనున్న మొహరం పర్వది నాన్ని పురస్కరిం చుకుని ఉదయగిరి వైఎస్సాసీపీ సమన్వ యకర్త మేకపా టి రాజగోపాల్‌రెడ్డి స్థానిక పీర్ల చావిడిలో వెలసిన పీర్ల ఊరేగింపులు, ఉత్సవాల నిర్వహణ కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మత సామరస్యం, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. నిర్వాహకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, మొహరం ఉత్సవాలను భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# దాడులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

- కూటమి ప్రభుత్వ అవినీతిని మరింత ఉధృతంగా ప్రజల్లోకి తీసుకెళతాం
- విద్యా సంస్థలపై దాడులు ప్రశ్నించే గొంతు నొక్కడమే



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త-విద్య** ప్రభుత్వ అవినీతిని ఎదిరించినందుకు కృష్ణచైతన్య విద్య సంస్థలపై దాడులు చెయడం నీతిమాలిన రాజకీయాలకి ప్రత్యక్ష నిదర్శనమని , ఇటువంటి దాడులకు , బెదిరింపులకు తాము బయపడే ప్రశక్తే లేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పెర్కొన్నారు. మంగళవారం నగరంలోనే స్తానిక పొదలకూరురోడ్డు లొని వైకాపా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

**కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లడుతూ** ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థల పై దాడులు చేయడం అంటే ప్రశ్నించే వారిని అణగదొక్కడమేనన్నారు. మెగా డియస్సీ లో ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రశ్నించడమే చంద్రశేఖర్ రెడ్డి చేసిన తప్పా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న 70 కాలేజీలను వదిలిపెట్టి కేవలం చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థలపై దాడులు చేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వ నేతలు .. రాజకీయాల్లో ఏ స్థాయికి దిగజారి పోయారు అర్థమవుతుందన్నారు. విద్యా సంస్థలపై ఈరోజు ప్రభుత్వం చేసిన దాడులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్నారు. ఇలాంటి వాటికి చంద్రశేఖర్ గాని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాని భయపడిపోదని ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సమస్యలపై పని చేస్తామని తెలిపారు.

**ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ** గత కొన్ని రోజుల్లో ప్రభుత్వం చేసిన తప్పులను,అలాగే మెగా డీఎస్సీ లో జరిగిన అక్రమాలను.. ప్రజల ముందుంచి దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట కృష్ణ చైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన ఆరు జూనియర్ కళాశాలల బ్రాంచ్ లపై..సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11:30 వరకు అధికారులు సోదాలు నిర్వహించారని తెలిపారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఈ విధమైన దుర్మార్గ వైఖరిని అవలంబించిందని ఆరోపించారు . నిన్నటి రోజున మంత్రి నారాయణ గారు.. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఉండగా మమ్మల్ని ఇబ్బంది పెట్టిందని మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన గత రెండేళ్ల కాలం నుంచి ఎంతో మంది వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయించి.. వేధింపులకు గురిచేయడం జరిగిందన్నారు. వైఎస్ఆర్సిపి పిలిపివ్వకుండానే నిన్నటి రోజున స్వచ్ఛందంగా..శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు. నెల్లూరు నగరానికి 19 మంది ఎమ్మెల్సీలు తరలివచ్చి నాకు సంఘీభావం తెలిపి ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యలను ఖండించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీలు ఎవరు మంత్రి నారాయణ గురించి ఎక్కడ ప్రస్తావించలేదని.. కేవలం ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, దుశ్చర్యలను ప్రశ్నించారని అన్నారు. మంత్రి నారాయణ ఈ విధమైన దాడులు చేయించారని మేము ఎక్కడ అనలేదన్నారు. ఇది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. మేము అనుకుంటే 164 మంది ఎమ్మెల్యేలను.. నెల్లూరుకు పిలిపించుకోలేమా అని కూటమి నేతలు మాట్లాడడం.. హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక కార్యకర్త, నాయకుడి, విలువ తెలియని నారాయణ కూడా.. ఇలాంటి మాటలు మాట్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని దుశ్చర్యలు, ఎన్ని దాడులు చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజాపక్షంగా ప్రజా సమస్యలపై వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలతో.. ప్రభుత్వం పై అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు.

**ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లడుతూ** డీఎస్సీ లో స్పోర్ట్స్ కోటాలో జరిగిన అక్రమాలను ప్రశ్నించడం పై ప్రభుత్వం కక్షగట్టి చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థలపై దాడి చేసిందని ఆనం విజయకుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఈ దాడులు గురించి.. చర్చించుకుంటున్నారని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో సరికాదని.. ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సీపీ ఆరోపణలపై ఆగ్రహించిన టీడీపీ నేతలు

- అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసిన టిడిపి నాయకులు





**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త – వైద్యం** వైఎస్ఆర్సీపీ ఆరోపణలపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు.

**రూప్ కుమార్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ** వైసిపీ ఎమ్మెల్సీలు నెల్లూరు నగరంలో రాజకీయ డ్రామా చేశారన్నారు. వైసిపీ రాజకీయ డ్రామాతో బాబాసాహెబ్ అంబేద్కర్‌కు అంటిన మకిలిని పాలతో కడిగి శుద్ధి చేసామన్నారుకృష్ణ చైతన్య విద్యాసంస్థలకి ఏమి జరిగిందని ఎంఎల్సీలు రాద్ధాంతం చేశారని ప్రశ్నించారు. ఇక్కడ చంద్రశేఖర్ రెడ్డి విద్యాసమస్థలు మూసేశారా లేదా క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపారా అని ప్రశ్నించారు. ఏమీ జరక్కపోయినా రాజకీయ కక్ష అంటూ సానుభూతి పొందే ప్రయత్నం చేశారన్నారు.కక్ష సాధింపులు అంటే చంద్రశేఖర్ రెడ్డికి తెలుసా నారాయణ ఫ్లెక్సీలు 48 గంటలలోపే తొలగించారన్నారు. చంద్రశేఖర్ రెడ్డి ఫ్లెక్సీలు రోజుల తరబడి అట్టే ఉన్నాయని, దీన్ని కక్షసాధింపు అంటారా నెల్లూరు నగరంలోని అంబేద్కర్ బొమ్మ సాక్షిగా వైసిపి నేతలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి పెద్ద రాజకీయ డ్రామాకు తెరలేపారంటూ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. మీ వీధి డ్రామాలకు అభివృద్ధితో సమాధానం చెబుతామన్నారు. మంత్రి నారాయణది కక్ష సాధించే స్వభావం అయితే నెల్లూరులో రాజకీయం చేయగలవా చంద్రశేఖర్ రెడ్డి అని సవాల్ విసిరారు. వైఎస్ఆర్సీపీ ఐదేళ్ళ పాలనలో కక్షసాధింపులను దగ్గరుండి చూసా, చీప్ రాజకీయాలు ఇకనైనా మానుకోండని హితవు పలికారు. కృష్ణచైతన్యతో పాటు నారాయణ, భాష్యం స్కూల్స్‌కి కూడా నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. విద్యా శాఖ లో సాధారణంగా జరిగిన తనిఖీలను రాజకీయ స్వార్థనికి వాడుకుంటున్నారని దుయ్యపట్టారు. దుర్మార్గపు ఆలోచనలతో పొలిటికల్ డ్రామాలు వేస్తున్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు మీ నీచరాజకీయాలు గమనిస్తున్నారన్నారు. లోకేష్ బాబు మీలా ఆలోచిస్తే కృష్ణ చైతన్య విద్యా సంస్థలు మూతపడేవని, మంత్రి నారాయణ మీ వికృత రాజకీయాలకు అభివృద్ధితోనే సమాధానం చెపుతారన్నారు. నెల్లూరు కార్పొరేషన్, డీలిమిటేషన్ ప్రక్రియ గురించి మాట్లాడే ఈ వైసిపి నేతలకు అసలు మున్సిపల్ చట్టాలు, వాటి ప్రాతిపదికలు తెలుసా అని కడిగిపారేశారు. కోర్టు ఏదో స్టే ఇచ్చిందని ఎగిరెగిరి పడుతున్నారని, తమకు న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉందని, వీటన్నింటికీ కాలమే సమాధానం చెప్తుందన్నారు.మంత్రి నారాయణ పక్షాన నెల్లూరు నగరం మొత్తం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం సేకరణ






**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం సచివాలయంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం భవన నిర్మాణాలు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సైడు కాలువలు, సిమెంట్ రోడ్ నిర్మాణాలకు ఇసుక ఎంతో అవసరమని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో మైనింగ్ ఏర్పాటుకు సంబంధించి ప్రజల వద్ద నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఇసుక లభ్యంగా ఉందని, మైన్స్ జువాలజీ శాఖ ప్రభుత్వానికి నివేదించిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో 1.67 హెక్టార్లలో ఇసుక లభ్యం ఉందని గుర్తించడం జరిగిందని, దీనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి డీఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ఇచ్చిన సూచనలను నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి అనంతరం ఇసుక రీచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, తదితరులు ఉన్నారు.

**పరిమితికి మించి లోడులు వద్దు** లేగుంటపాడులోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే భారీ వాహనాలు పరిమితికి మించి లోడుతో వాహనాల రివాణాను అరికట్టేలా సంబంధిత రవాణా ధికారులు దృష్టి పెట్టాలని పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. లేగుంటపాడు నుంచి ఇనమడుగు సెంటర్ వరకు పలు చోట్ల రోడ్లు గుంతలు పడి ఉన్నాయని, కల్వర్టులు కూడా మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉందని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక రవాణా చేసే వారు టార్పాలిన్ పట్ట కట్టుకునే రవాణా చేయాలన్నారు. ఈ ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాట్లలో లేగుంటపాడు గ్రామంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## ఓటరు జాబితా సవరణ నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- బిఎల్ఓలకు సూచించిన కలెక్టర్



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త – కలెక్టరేట్** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం నెల్లూరు నగరంలోని హరినాథపురంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ నెం.174 పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బీఎల్వోలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, తాసిల్దార్ సుధీర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నిధుల స్వాహా పై ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన

- చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వింజమూరు, జూన్ 23, ప్రభాతవార్త** వింజమూరు మండలం నల్లగొండలో శంఖవరం గ్రామాలలోని పాఠశాలలకు సంబంధించి గతంలోనే పూర్తి అయిన ప్రహరీ గోడల పనులకు మళ్లీ బిల్లులు పెట్టి 21.89 లక్షల స్వాహా చేశారని ఆరోపణలపై మంగళవారం ఆయా గ్రామస్తులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గత ప్రభుత్వ హయాంలో 2020-21 సంవత్సరంలో నల్లగొండ ప్రాథమికోన్నత పాఠశాల శంఖవరం ప్రాథమిక పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయి గుత్తేదారులు అప్పుడే బిల్లులు డ్రా చేసుకున్నారు. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వికసిత్ భారత్ పథకం కింద పనులు వేగవంతం చేయాలని అదేశించడంతో ఎంఈఓ కార్యాలయంలో ఔట్సోర్సింగ్‌గా పనిచేస్తున్న వ్యక్తి పాత పనులకే మళ్లీ ఎం బుక్‌లో నమోదు చేయించి తన సతీమణి పేరుతో నిధులు కాజేసినట్లు వారు పేర్కొన్నారు. గతంలో నల్లగొండలో పాఠశాల ప్రహరీకి 9 లక్షల 4 వేల 716 రూపాయలు శంఖవరం పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఆరు లక్షల 42 వేల 148, ఆరు లక్షల 42వేల 148 రూపాయలు మొత్తం 89 వేల 12 రూపాయలు జరిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఏడాది జనవరి 24 పనులు మొదలు పెట్టినట్లు చూపించి ఈ బిల్లులు డ్రా చేశారని వారు తెలిపారు ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని విషయం బయట పడడంతో సిగ్గు తేల్చాల్సిన అధికారులు చేతులెత్తేస్తున్నారని ముఖ్యంగా మండల సర్వ శిక్ష అభియాన్ ఏఈ ఎల్లాల కృష్ణారెడ్డి ఆ బిల్లుతో నాకు సంబంధం లేదని చెప్పగా ఎస్ఎస్ఏఈ ఈ దస్త్రాలపై ఉన్న సంతకాలు నావి కావనీ ఎవరో ఫోర్జరీ చేసి ఉంటారని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ కార్యాలయం నుండి 2020-21 సంవత్సరానికి సంబంధించిన పనులు బిల్లులు చెల్లించాలని పంపగా ఆమోదం తెలిపామని నిధులు మంజూరు విషయం ఆ శాఖకు తెలియాలని తెలిపారు. గ్రామస్తులు నిధులు స్వాహా చేసిన దోషులను ఆరెస్ట్ చేయాలని నిధులు రికవరీ చేయాలంటూ పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## డయిల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి అనూహ్య స్పందన

సమస్యలపై వెంటనే స్పందించాలి కావలి ఎమ్మెల్యే



**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** కావలి ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన డయిల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు ఫోన్‌చేసి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి కాల్‌ను స్వీకరించి ప్రజల సమస్యలను ఓపికగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అల్లూరు మండలం పురిడి గ్రామానికి చెందిన వైసిపి మాజీ సర్పంచ్ భర్త ఎం.సుబ్బారావు గ్రామంలోని హరిజనవాడలో విద్యుత్‌వైరు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఇటీవల పురిడి విద్యుత్ సమస్యలను గుర్తించి గ్రామంలో సుమారు రూ.80లక్షల వ్యయంతో కొత్త విద్యుత్ స్తంబాలు ఏర్పాటు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రంగసముద్రంలో ఆర్ఓ ప్లాంటు కోసం ప్రజలు విన్నవించుకోగా స్పందించిన ఎమ్మెల్యే స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఉచితంగా ఆర్ఓ ప్లాంటు ఏర్పటు చేస్తామని హామీ ఇచ్చారు. రూరల్ మండలం చౌదరిపాలెంకు చెందిన మహిళ ఆర్టీసి బస్సు సౌకర్యం తమ గ్రామానికి కల్పించాలని కోరారు. సంబందిత ఆర్టీసి అధికారులతో సంప్రదించి ఓ బస్సును మీ గ్రామానికి కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే ఎమ్మెల్యే మరోసారి ప్రత్యేకతను చాటుకున్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం, సర్ విజయవంతం చేయాలి

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త – వైద్యం** జూన్ 25 నుంచి ఇంటింటికీ తెలుగుదేశంగడప గడపకు కూటమి విజయాలు కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి టెలీ కాన్ఫరెన్స్‌లో పార్టీ శ్రేణులకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దిశా నిర్దేశం చేసారు. ఇంటింటికీ తెలుగుదేశం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాలను నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి రాబోయే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, మంత్రి, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సూచనల మేరకు జూన్ 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఇంటింటికీ తెలుగుదేశం, గడప గడపకు కూటమి విజయాలు, కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆయా మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అందరూ చురుగ్గా పాల్గొని ప్రజలను చైతన్యపరచాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాల వివరాలను, ప్రగతిని ఎప్పటికప్పుడు తప్పనిసరిగా మై టిడిపి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని, అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దిశా నిర్దేశం చేశారు.

## కేవలం విద్యతోనే సమానత్వం, గౌరవం లభిస్తాయి

- పవన్ కళ్యాణ్ ఆలోచన, మా ఆలోచన ఒకటే
- మేము కక్ష సాధింపులు చేయాలనుకుంటే మీరు వ్యాపారాలు చేయలేరు
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు పరమేశ్వరి నగర్ నందు గల వక్ఫ్ భూమి నందు నిర్మిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు, వక్ఫ్ సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 20 కోట్లు సిఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ స్థాయి స్కూల్‌ను నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలని శరవేగంగా, పనులు జరుగుతున్నాయని తెలిపారు. తనకు అన్ని జిల్లాల నుంచి స్థలాలు కేటాయించాలని ఫోన్లు చేస్తున్నారని స్థలాలు కేటాయిస్తే తాము కూడా స్కూళ్లు నిర్మిస్తామని ముందుకు వస్తున్నారు అని అన్నారు. తాలేం ఏ హునర్‌తో 250 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని, కేవలం చదువుతూనే సమానత్వం గౌరవం దొరుకుతాయని అన్నారు. వక్ఫ్ భూములు నిరుపయోగంగా ఉంటే ఆక్రమణకు గురవుతున్నాయని, ఆస్తులను నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగంలోకి తీసుకుని వచ్చి ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. స్కూల్ నిర్మాణానికి సహకరించిన మంత్రి నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

**కృష్ణ చైతన్య విద్యాసంస్థల వివాదం పై స్పందించిన అబ్దుల్ అజీజ్** నెల్లూరులో ఉన్న కాలేజీలు మాత్రమే రైడ్ చేయలేదని, వెడత వారం భీమవరంలో నారాయణ కాలేజీని కూడా రైడ్ చేశారని అన్నారు. రూల్స్ పాటిస్తే అంత భయం ఎందుకని అన్నారు. మంత్రి నారాయణ స్వభావం కక్ష సాధింపులు చేసే స్వభావం కాదని, కక్ష సాధింపులు చేస్తూ మీరెవరు వ్యాపారాలు చేయలేరని హెచ్చరించారు. ప్రతిపక్షంలో మమ్మల్ని ఎందుకు కష్టాలు పెట్టారని అన్నారు. ప్రతి విషయంలో నేను ఉన్నాను ముందుకు వచ్చినప్పుడు మిస్టర్ క్లీన్‌గా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ పై రాజకీయ బురద వేయొద్దని, మీ పై ఉన్న బురద కడుక్కోవాలని అన్నారు.

**ఏఎస్ పేట దర్గా విషయం పై స్పందన** ఎస్ పేట సజ్జాద హఫీజ్ పాషా బోర్డుకు వ్యతిరేకంగా 32 కేసులు వేశారని అన్నారు. సజ్జాద పనులు సరిగ్గా చేయడం లేదని అతనికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. గతంలోనే అతనిని మతవల్లిగా తొలగించామని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆలోచనే తమ ఆలోచన కూడా అని వివరించారు. ఎంక్వయిరీ పూర్తికాకుండా చర్యలు బహిర్గతం చేయలేమని, వెరీ పూర్తయ్యాక అతని మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్, ఖాజా, ఇస్మాయిల్ బేగ్, బెపారి జాకీర్ అహ్మద్ సీఈవో యాకూబ్ ఖాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రీవిజన్ కార్యక్రమంలో కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 23 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రీవిజన్ కార్యక్రమ నిర్వహణలో భాగంగా కేంద్ర ఎనినకల కమిషన్ ఆదేశాల మేరకు 117 నెల్లూరు సిటీ నియోజకవర్గ బూత్‌లెవల్ ఏజెంట్లకు స్థానిక కస్తూరిబా కళాక్షేత్రంలో మంగళశారం ఈఆర్ఓ, కమిషనర్ వై.ఓ.నందన్ సమీక్షను నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పాటించి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగాసూచించారు. అన్ని రాజకీయ పార్టీల బిఎల్ఏలు తమ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకొని అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో స్థానం కల్పించి ప్రభుత్వం నిర్దేశించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## సహారా ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్ధులకు విద్యాసామాగ్రి పంపిణి

**బుచ్చి జూన్ 23 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామంలో ఎంపిపిఎస్ ( ఎస్‌సి) పాఠశాలలో సహారా ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ వారు ఒకటో తరగతి నుండి ఐదో తరగతి బాల బాలికలకు పలకలు నోటిబుక్స్ పెన్స్, పెన్సిల్స్,రబ్బర్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతు అడిగిన వెంటనే పిల్లలకు సహాయం చేసినందుకు స్కూల్ తరపున సొసైటీ



యజ్దాని బాషాకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అద్యక్షులు యస్దానిబాషా మాట్లాడుతు పేదవారు కాబట్టి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశా లలో చదివే వారికి మంచి అవకాశాలు ఉన్నాయి. పేదవారికి చదువు అనేది వరం చదువుకున్న వారికి విలువ ఉంటుంది. ఉద్యోగస్తుడైతే ఇంకా మంచి విలువలు ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని విధాలా పేద పిల్లలకు సౌకర్యం కల్పిస్తుంది. తల్లికి వందనం, మధ్యహ్న భోజనం యూని ఫారాలు, బూట్లు,బ్యాగులు, అన్ని ప్రభుత్వం సమకూర్చునది కాబట్టి , ప్రతి పేదవాడు చదువుకునే అవకాశం ఉన్నది మీరందరు బాగా చదువుకొని మీ ఊరికి ,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు టి.గోపాలకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు హేమంత్‌కుమార్,పిల్లలు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## అధికారులు లేకుండా రోడ్డు నిర్మాణ పనులు

**మనుబోలు జూన్ 23 ప్రభాతవార్త :** మనుబోలు మండలం వీరంపల్లి రోడ్డు నిర్మాణం పనులు ఆర్అండ్‌బి అధికారులు లేకుండా జరుగుతున్నాయని స్దానికంగా విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా నిత్యం వాహనాలు వెళ్ళే మార్గం కావడంతో లక్షలాది రూపాయాలు ప్రభుత్వ నిధులతో పనులు చేస్తున్నారు. నాణ్యత కూడా లేదని స్దానిక ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. ఇటు అధికారులు లేక అటు నాణ్యత లేక రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



నిబంధనల ప్రకారం ఆర్అండ్‌బి అధికారులు దగ్గరుండి రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సి న అవసరం ఉంది. అంతే కాకుండా కంకర వేసి క్యూరింగ్ చేసి రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండడంతో కేవలం ట్యాంకర్‌తో నీళ్ళు చల్లి వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో వేసిన ప్యాచ్ వర్కు కూడా సంవత్స రం కాక ముందే గుంటలు బటయపడ్డాయి. ఈవిషయమై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా ఇఈ,ఏఈలు గత 15 రోజులుగా సెలవులో ఉన్నారని ఈఈను స్దానిక విలేకర్లు విరణ కోరగా ఎట్టి పరిస్దితు లలో నాణ్యత లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులను పర్యవేక్షణకు పంపుతామన్నారు.

## పేరుపోగు క్రాంతికుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి

**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** కృష్ణలంక సిఐ నాగరాజు వేధింపులు తట్టుకోలేక విజయవాడకుచెందిన దళిత యువకుడు పోగుక్రాంతికుమార్ గతనెల 22న ఆత్మహత్యకు పాల్పడ్డారని అయితే ఇంతవరకు ఆ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయలేదని వెంటనే సిఐ నాగరాజుపై ఎస్‌సి,




ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర మలమహానాడు అధ్యక్షులు దాసరి శివాజీ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆయన దళిత సంఘాలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోగు వెంటకేశ్వర్లు కుమారుడు క్రాంతికుమార్ గతనెల 21న ఒక కేసు విషయంపై క్రిష్ణలంక సిఐ నాగరాఉ తీసుకెళ్లి అతినిని కొట్టి వేధింపులకు గురిచేయడంతో అవమానం తట్టుకోలేక 22న ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు తెలిపారు. అయితే ప్రభుత్వ ఇంతవరకు ఆ కుటుంబానికి న్యాయం చేయలేదని ప్రశ్నంచారు. అదే సిఐ గాదే సాయిక్రిష్ణమృతి చెందిదే ప్రభుత్వం ఆగమేఘాలపై సిఐ నాగరాజుపైన కేసు నమోదు చేసి సిట్‌ను ఏర్పాటుచేసి కేసును వేగవంతం చేసిందన్నారు. అయితే దళితుడైన పోగు క్రాంతికుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఎస్‌సి కమిషన్ కానీ పరామర్శించి న్యాయం చేసింది లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం సిఐ నాగరాజుపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి దళిత కుటుంబమైన పోగు క్రాంతికుమార్ కుటుంబానికి అన్ని విధాల న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో దళిత సేవ పట్టణ అద్యక్షుడు ఒంగోలు అశోక్‌బాబు, దళిత నాయకులు నరసింహారావు, మైనార్టీ సంఘ నాయకులు నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## కావలి పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టడం హర్షనీయం

**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న వైకుంఠపురం పక్కారోడ్ల నిర్మాణానికి డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం హర్షనీయమని సామాజిక కార్యకర్త సి.శారద మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నపగుంట ప్రాంతంలో మురికినీరు తొలగించి సుందరమైన పార్కు నిర్మించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. న్యాయస్థానం ప్రకటించినట్లు పుట్‌పాత్‌పై నడవడం పాదచారుల హక్కుగా కవాలిలో ట్రంక్‌రోడ్డుకు ఇరువైపులా, ఉదయగిరి రోడ్డు పెద్దపవని రోడ్లకు ఇరువైపులా పాదచారుల కోసం అక్రమణలు గురైన పుట్‌పాత్‌లను పునరుద్దరించడం అత్యవసరం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్ధులు చేరేందుకు ప్రత్యేక డ్రైవ్



కూడా ప్రారంభించే కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించిన వారికి కళాశాలల్లో చేరేటప్పుడు ప్రత్యేక రిజర్వేషన్‌కల్పిస్తే ప్రభుత్వ పాఠవాలలు విద్యా ర్ధులకు ప్రోత్సా హకంగా ఉంటుందన్నారు. కావలి అభివృద్దిలో భాగంగా ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశా లలను స్దాపించే దిశగా కావలి ఎమ్మెల్యే తగు చర్యలు చేపడితే పేద బడుగు వర్గాలకు ఎంతో మేలుచేసినట్లు అవుతుందన్నారు.

## అక్రమ మద్యం విక్రయించిన వ్యక్తి అరెస్టు

**– ఏడు మద్యం సీసాలు స్వాధీనం**



**చిల్లకూరు, జూన్ 23, ప్రభాతవార్త :** గూడూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చిల్లకూరు మండలంలో ప్రత్యేక తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరావారిపాలెం గ్రామంలో నిర్వహించిన తనిఖీలలో నాసిన మునెయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని తన పై సంబంధిత చట్టాల ప్రకారం బెల్ట్ షాపు కేసు నమోదు చేసామని ఎక్సైజ్ సిఐ కరీనా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ఎక్సైజ్ శాఖ నిరంతర తనిఖీలు నిర్వహిస్తుందని, ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీలలో సబ్ ఇన్స్పెక్టర్ పి. మహేష్. కానిస్టేబుల్స్ శ్రీరాములు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త :** గూడూరు ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో గూడూరు డిపో నందు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమణ రాజు మధుసూదన్ రెడ్డి, జోనల్ నాయకులు వెంకయ్య డిపో ప్రెసిడెంట్ శ్రీనివాసులు డిపో సెక్రటరీ ప్రవీణ్ గ్యారేజ్



సెక్రటరీ పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీఏ నడపాలని, మూసివేసిన డిపోలను తెరిపించాలని, పిఆర్సి కమిటీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డిఏ బకాయిలు చెల్లించాలని, కొత్త బస్సులు నాలుగు వేలు వేయాలని, 15 వేల ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## రేయాన్ష్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాలకు వాటర్ కూలర్ బహుకరణ

**తోటపల్లి గూడూరు, జూన్ 23, ప్రభాతవార్త :** మండలంలోని వరిగొండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం వాటర్ కూలర్‌ను బహుకరించారు. స్థానిక సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకుడు, విజయ డైరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసుల రెడ్డి అలియాస్ (చినబాబు రెడ్డి) మనుమడు పెళ్లూరు రేయాన్ష్ రెడ్డి చేతుల మీదుగా ఈ వాటర్ కూలర్‌ను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా చినబాబు రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థులు స్వచ్ఛమైన చల్లటి తాగునీరు అందుబాటులో పొందేందుకు వాటర్ కూలర్‌ను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. చిన్నారి రేయాన్ష్ రెడ్డి చేతుల మీదుగా జరిగిన ఈ



వితరణ కార్యక్రమాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈదూరు గ్రామానికి చెందిన ప్రజా నేత పెద్ద సతీష్ నాయుడు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని దాతలను అభినందించారు.

## వింజమూరులో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు జోరు

**వింజమూరు, జూన్ 23, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో వింజమూరు మండల వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి. చెంచల బాబు నేతృత్వంలో రెండు రోజుల పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ జెడ్పీపాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల స్థానిక



సమస్యలు, విద్యా రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. యూటీఎఫ్ పోరాటాలు, సాధించిన విజయాలను వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 130 మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా యూటీఎఫ్‌లో సభ్యత్వం తీసుకున్నట్లు మండల అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. వీరాంజనేయులు, వై. పరమేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం యూటీఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జి. చెంచల బాబు, ఆర్. వెంకటేశ్వరరెడ్డి, ఎం. వీరాంజనేయులు, కె. కృష్ణారెడ్డి, ఎస్‌కె. ఖాదర్ భాషా, వై. జగన్ మోహన్, పి. సుబ్బారావు, పి.వెంగళరావు, వై. పరమేశ్వరరావు, ఎస్.కె. మీరావలి, సిహెచ్. శివకుమార్, సిహెచ్. మహేంద్ర, ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

## ఘనంగా కోదండ రామస్వామి వార్షిక వేడుకలు

**వింజమూరు, జూన్ 23, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయితీ పరిధిలోని ఎస్టీ కాలనీలో శ్రీ కోదండ రామస్వామి వార్షిక సంవత్స ర వేడుకలను ధర్మకర్త మల్లిక రామారావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అంకురార్పణతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రెండో రోజు బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు. మూడవ రోజు గురువారం గ్రామ సభ్యుల ఆధ్వర్యంలో తలంబ్రాల కార్యక్రమం, స్వామి



వారి కల్యాణోత్స వం కన్నులపండువగా జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు ఉభయకర్తలుగా మీనాక్షి, అంజయ్య దంపతులు వ్యవహరించగా, రెండవ రోజు సాలమ్మ, మాల్యాద్రి దంపతులు ఉభయకర్తలుగా సేవలందించనున్నారు. మూడవ రోజు గ్రామస్తులందరి సమక్షంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో కమిటీ సభ్యులు వెంగళరావు, శివకుమార్, శీను, ఆలయ పూజారి నవీన్ కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నేతలు నివాళులు

**చేజర్ల, జూన్ 23, ప్రభాతవార్త :** భారతదేశ అఖండత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చేజర్ల మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలోని 265 బూత్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి



పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారతదేశ అఖండత్వ పరిరక్షణలో ఆయన చేసిన త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశభక్తి, జాతీయత భావాలను బలోపేతం చేయడంలో ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల బీజేపీ అధ్యక్షులు గుండాల విజయభాస్కర్‌రెడ్డి,నెల్లూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు బత్తుల కృష్ణయ్య, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఈఎంసీ జగ్గారెడ్డి, మండల నాయకులు తూమాటి విజయకుమార్‌రెడ్డి, మండల బీజేపీ ఉపాధ్యక్షులు ఓర్సు పెంచలయ్య, చేజర్ల గ్రామ సీనియర్ నాయకులు పందల రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యనమదల, కాకివాయి రైతులకు యూరియా పంపిణీ

**చేజర్ల, జూన్ 23, ప్రభాతవార్త :** చేజర్ల మండలం యనమదల, కాకివాయి గ్రామాల్లోని రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించినట్లు చేజర్ల వ్యవసాయాధికారి హిమబిందు తెలిపారు. ఈ ప్రాంతంలో దాదాపు 400 ఎకరాల్లో రైతులు వరి విత్తనాలు విత్తినట్లు గుర్తించామని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల వివరాల ప్రకారం, రైతులందరూ కేఎన్ఎం-1638 రకం వరి విత్తనాలను సాగు



చేశారన్నారు. పంట సాగు వివరాలను రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయగా, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సుమారు 400 ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు నిర్ధారించారన్నారు. ఈ నేపథ్యంలో రైతుల వివరాలను ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్‌లో నమోదు చేసి, వారి ఆధార్ నంబర్లు, సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలను ధృవీకరించారన్నారు. యాప్‌లో నమోదు పూర్తయిన రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ గుర్తింపు పొందిన ఎరువుల డీలర్ వద్ద నుంచైనా యూరియాను పొందవచ్చని అధికారులు తెలిపారు. యూరియా పంపిణీని మూడు విడతలుగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో రైతులు నాలుగు బస్తాల యూరియాను పొందవచ్చు. రెండవ విడతను పంట విత్తిన సుమారు 20 రోజుల తర్వాత అందజేయనున్నారు. మూడవ విడతను పంట వెన్ను తీసే దశకు ముందు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. యూరియా సరఫరాను పారదర్శకంగా నిర్వహించేందుకు డిజిటల్స్ విధానాలను అమలు చేస్తున్నామని, రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ వివరాలు, సాగు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. పంట దిగుబడులు పెరగడానికి సమతుల్య ఎరువుల వినియోగం అవసరమని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు.

## గురువుల సర్దుబాట

**కోట, జూన్ 23 ప్రభాతవార్త :** విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల ప్రవేశాల ఆధారంగా ఎక్కడ ఉపాధ్యాయులు అవసరం? అదనంగా ఎక్కడ ఉన్నారో జాబితా సిద్ధం చేస్తున్నారు. నెలాఖరులోగా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. పోస్టు మంజూరై ఉపాధ్యాయుడు లేని పాఠశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిగులు ఉపాధ్యాయులను ముందుగా అదే మండలంలో సర్దుబాటు చేయనున్నారు. తర్వాత డివిజన్ స్థాయిలో మిగిలిపోయిన వారిని పక్క మండలాలకు పంపిస్తారు. జూనియర్లు తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంటుంది. సీనియర్లు వెళ్లేందుకు ఇష్టపడితే అవకాశం కల్పిస్తారు. క్లస్టర్‌లో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారు. మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను వారి సీనియారిటీ ఆధారంగా సర్దుబాటు చేయనున్నారు. ఆ మేరకు కోట మండలంలో సర్దుబాటు జాబితాను ఎంఇఒ-1 శిరీష కసరత్తు చేస్తున్నారు.

## 28న పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

**కోట, జూన్ 23 ప్రభాతవార్త :** ఈ నెల 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని కోట మండలంలో విజయవంతం చేయాలని చిట్టేడు ఉప ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోరారు. కోట మండలంలో ఐదేళ్లలోపు వయస్సు న్న చిన్నారులు 2,800 మంది ఉన్నారని చెప్పారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛంధ సంస్థలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాలువ పూడికతీత

**బిట్రగుంట జూన్ 23 ప్రభాతవార్త :** భూగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట ముస్లిం కాలనీలో మంగళవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు దుర్గంధం గా ఉన్న మురుగునీటిని తెలుగు తమ్ముళ్ల పంచాయతీ సిబ్బందిచే శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసి డైరెక్టర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ సుదీర్ బాబు, గ్రామ పార్టీ నాయకులు షేక్ అహ్మద్ భాష, చిలక జానకి రామయ్య,బి ఎం ఆర్ యువసేన అధ్యక్షులు షేక్ సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.



## ఆదరణ కేంద్రంలో పెద్దిరెడ్డి వెంకట్రామిరెడ్డి వర్థంతి వేడుకలు

**బిట్రగుంట జూన్ 23 ప్రభాతవార్త :** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణకేంద్రం లో దుత్తలూరు లక్ష్మీపురం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకట రామిరెడ్డి రమణమ్మ గార్ల వర్ధంతి వేడుక సందర్భంగా వారి మనవడు పెద్దిరెడ్డి ప్రశాంత్ రెడ్డి యస్మిత్ గార్లు అనాథలకు భోజనం




పండ్లు స్వీట్ అందజేశారు ఈ సందర్భంగా ఆదరణకేంద్రం డైరక్టర్ సింహాద్రి రావు మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని దుత్తలూరునుండి ఆదరణకేంద్రంలో అనాధలకు భోజనం అందజేయుటకు వచ్చిన ప్రశాంత్ రెడ్డి దంపతులకు కృతఘ్నుతలు తెలుపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి ప్రశాంత్ రెడ్డి యస్మిత అశోక్ తదితరులు పొల్గొన్నారు

## పారదర్శకతతో రేషన్ సరుకుల పంపిణీ జరపాలి

**:తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**

**కొడవలూరు, జూన్ 23 ప్రభాతవార్త:** రేషన్ కార్డుదారులకు సరుకుల పంపిణీ పారదర్శకంగా, సకాలంలో జరిగేలా రేషన్ డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కొడవలూరు తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు.



రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు కొత్త మండల విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే గ్రామ స్థాయిలోనూ విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ, అర్హులైన ప్రతి కార్డుదారునికి ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో సరుకులు అందేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. డీలర్లందరూ సమన్వయంతో పనిచేస్తూ, సమానత్వ దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. రేషన్ దుకాణాల వద్ద ఫిర్యాదులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటించడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ దుకాణాల్లో సక్రమమైన సేవలు అందించాలని తహశీల్దార్ సూచించారు. ఈ సమావేశంలో జూనియర్ అసిస్టెంట్లు అశ్విన్,ప్రసన్న మరియు డీలర్లు పాల్గొన్నారు.

## భూ పంపిణీ, హామీల అమలుకు కార్మికుల డిమాండ్

**కొడవలూరు, జూన్ 23 ప్రభాతవార్త:** బీకేఎంయూ జాతీయ సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొడవలూరు మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ



ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని, జీపీఎస్ ఆధారిత విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భూ బ్యాంకులో ఉన్న భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని, గిరిజనులకు ఉపాధి హామీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. గండవరం పంచాయతీ పరిధిలోని కొత్త గిరిజన కాలనీలో ఇళ్ల స్థలాలు లేని గిరిజన కుటుంబాలకు స్థలాలు కేటాయించి గృహాలు నిర్మించాలని, ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గుది విజయ్‌కుమార్ మాట్లాడుతూ గండవరం గ్రామంలోని గిరిజనులకు పట్టాలు మంజూరు చేసినప్పటికీ, వారికి కేటాయించిన స్థలం ఎక్కడుందో ఇప్పటివరకు చూపలేదని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలను గుర్తించి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అందజేసి గోడును వివరించారు. దీంతో తహశీల్దార్ మాట్లాడుతూ పై అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆందోళనలో సంఘం నాయకులు తలారి శివయ్య,వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో రాజీ లేదు: తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న

**కొడవలూరు జూన్ 23 ప్రభాతవార్త:** మండలంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయడంలో ఎలాంటి రాజీ ఉండబోదని తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని 13 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సర్ ప్రక్రియ అమలుపై ఆమె ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బూత్



స్థాయి అధికారులు (పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు) పనితీరును పరిశీలించిన తహశీల్దార్, పనుల్లో నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికీ ప్రక్రియ పూర్తికాకపోవడంపై అధికారులను ఆమె నిలదీశారు.అప్పగించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలి. పనితీరు, సమయపాలనపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. నిర్లక్ష్యం ఉంటే నివేదిక తయారు చేసి పై అధికారులకు పంపిస్తాం" అని తహశీల్దార్ తెలిపారు. వీఆర్వోలపై అనుమానాలు.. సర్ ప్రక్రియపై ప్రజల ఆరోపణలు ఇదే సమయంలో మండలంలో సర్ ప్రక్రియపై గ్రామస్థుల నుంచి వీఆర్వోలపై పలు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఓటర్లకు సమాచారం ఇవ్వకుండానే పత్రాలు పూర్తి చేస్తున్నారనే అను మానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, కొంతమంది గ్రామ రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఓటర్ల అనుమతి లేకుండానే సంతకాలు, వేలిముద్రలు నమోదు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో సర్ ప్రక్రియ పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తు తున్నాయి. అన్నారెడ్డిపాలెం పంచాయతీలో సుమారు 1200 ఓటర్ల జాబితా పత్రాలను ఓటర్లకు అందజే యకుండా కార్యాలయంలోనే ప్రక్రియ పూర్తి చేస్తున్నారనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని గ్రామస్థులు, బాధితులు అధికారులను కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

**కొడవలూరు, జూన్ 23 ప్రభాతవార్త:** మండలంలోని అన్నారెడ్డిపాలెం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవితారాణి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సి న సాగు విధానాలు, విత్తన శుద్ధి, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాలను వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ



పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మోనిక,విజయలక్ష్మి,రాకేష్, సురేష్ పాల్గొన్నారు.

## ఎరువుల యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలి

**కోవూరు, జూన్23 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమాలను సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ఎస్ సైంటిస్ట్ వినీత మాట్లాడుతూ రైతులు తమ ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వాడడం వలన నేల ,



నీరు కాలుష్యం పెరిగి వాతావరణం కలుషితమవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు పురుగుమందులు వాడుకోవాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా రైతులకు కావాల్సి న ఎరువులను అందజేయాలని ఆదేశాలు ఇచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌లో రైతులు తమ విస్తీర్ణాన్ని నమోదు చేసుకుని తద్వారా ఎరువులు పొందాలన్నారు. సబ్ డివిజన్‌లో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదన్నారు. మండల వ్యవసాయాధికారిణి రజని మాట్లాడుతూ భూమి మీద ఉష్ణోగ్రత పెరగడం వలన రాష్ట్రంలో వర్షపాతం సాధరణం కన్నా తగ్గే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బీడు భూముల్లో రైతులు పీఎండీఎస్ కిట్లను, పచ్చిరొట్ట ఎరువులను వేసి ఉష్ణోగ్రత తగ్గించా లన్నారు. ఎంపీటీసీ సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఈవో శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు కళ్యాణి, కీర్తన, రైతులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 23ప్రభాతవార్త:** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ, కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## పల్స్‌పోలియో పై మండలస్థాయి కన్వర్జెన్సీ మీటింగ్

**సంగం జూన్ 23 ప్రభాతవార్త :** సంగం మండలం ఎంపిడిఒ షాలెట్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో పల్స్ పోలియోపై మండల స్థాయి కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి తహసిల్దారు సారంగపాణి, ఎంఇఒ మల్లయ్య, మండల అధికారులు హాజరు కావడం జరిగింది. స్థానిక ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో 2026 వైద్య ఆరోగ్య సిబ్బందితో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈనెల 28 వ తేదిన ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పిహెచ్‌సి పరిధిలో ఐదేళ్ళ లోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. సంగం మండలంలో ఐదేళ్ళ లోపు 2996 ఐదు సంవత్సరాలు లోపు పిల్లలకు 23 బూతులు మరియు ఒక ట్రాన్సిస్ట్,మొబైల్ వెహికల్ ఒకటి నాలుగు రూట్ వెహికల్స్ ఏర్పాటు చేయడమైనదని తెలియపరిచారు. మండలంలో ఉండే ప్రజలందరు మీ పరిధిలో ఉన్నటువంటి అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల వరకు ప్రతి బిడ్డకు పోలియో చుక్కల వ్యాక్సిన్ వేయించి పోలియో నిర్మూలనకు సహకరించగలరని కోరడమైనది. ఈ కార్యక్రమంలో మొదటి రోజు బూత్ యాక్టివేట్‌గాను,రెండరోజు ,మూడవరోజు ఇంటింటికి తిరుగుతు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలియజేయడమైనది. ఈకార్యక్రమంలో డాక్టర్ అశోక్, హెచ్ఈఒ మల్లం కొండయ్య, సూపర్‌వైజర్ స్టాఫ్ జలీల్ మేరీ సుజాత, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## సర్వేకు రైతులు సహకరించాలి

**కోట,జూన్ 23 ప్రభాతవార్త :** కోట మండలం కర్లపూడి గ్రామంలో జరుగుతున్న సర్వే ను మంగళవారం కోట మండల తహిసీల్దార్ .కె. జయజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. దీంతో రీ సర్వే తొందరగా పూర్తి చేసేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. సర్వే అధికారులు కూడా రైతుల సహకారం తీసుకోవాలని సూచించారు.



## పీరును చేతబూని గుర్రంపై గ్రామోత్సవం

**అల్లూరు, జూన్ 23 ప్రభాతవార్త :** అల్లూరులోని తూర్పు మహమ్మదీయ పాలెం పీర్ల చావడి వద్ద మెహరం వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి అగ్నిగుండాన్ని తొక్కి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కర్బలా యుద్ధంలో ఆశువులు బారిన వీరులను స్మరించుకుంటూ నిర్వహించుకునే మొహరం వేడుకలను ఏడవ రోజైన మంగళవారం ఇమామ్‌ఖాసీం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పీర్లచావిడి వద్ద పూజలు నిర్వహించి పీరును చేతబూని గుర్రంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలంటు వినతి

కలువాయి జూన్ 23 ప్రభాతవార్త : మండలంలోని ఎర్రబల్లి ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పై చర్య తీసుకోవాలంటు పాఠశాల విద్యార్దులు తల్లిదండ్రులు స్థానిక ఎంఆర్‌సి నందు ఎంఇఒలు -1,2 నవీన్‌కుమార్,జనార్ధన్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు.వైసిపి విద్యార్ధి విభాగం అధ్యక్షులు మల్లికార్జున ఎర్రబల్లి గ్రామస్తులతో కలిసి ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. విలేఖర్ల సమావేశంలో మల్లికార్జున మాట్లాడుతు పాఠశాలలో 40 మంది విద్యార్దులు చదువుతుండగా వారిలో 30 మంది విద్యార్దులు పాఠశాలకు రావడం లేదని సాకు చూపుతో వారిని తిరిగి మరల అదే తరగతిలో కొనసాగేలా చూస్తున్నారని వారు తెలిపారు. విద్యార్దులను పాఠశాలకు రానివ్వకుండా టి.సి ఇస్తాను బయట ప్రాంతాలకు వెళ్ళి చదువుకోండి అంటు దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆయన తెలిపారు. విద్యార్దుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడ్ని సస్పెండ్ చేయాలంటు వారు నినిదాలు చేశారు. జరిగిన సంఘటనలపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను విద్యార్దుల తల్లిదండ్రులు కోరారు.



## విద్యార్ధులకు విద్యాసామాగ్రి పంపిణి

**సీతారామపురం జూన్ 23 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని పండ్రింగి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల విద్యార్దులకు పండ్రింగి గ్రామానికి చెందిన సింగాల వెంకటరమణ సుభాషిణి, దంపతుల సహకారంతో మంగళవారం టిడిపి నాయకులు సింగాల నాగేష్‌యాదవ్ విద్యాకిట్లను పంపిణి చేశారు. విద్యార్దులకు నోట్‌బుక్స్,పెన్నులు, పెన్సిల్స్ తదితర విద్యాసామాగ్రిని అందజేశారు. విద్యార్దులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలాను సాధించాలని సూచించారు. ఈవిద్యా కిట్లు విద్యార్దులకు ఎంతో దోహద పడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్దులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసి డిపో ఎదుట ధర్నా

**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** ఏపి పిటిడిరాష్ట్ర జేఏసి పిలుపు మేరకు ఆర్టీసి డిపో ఎదుట కావలి డిపో జేఏసి ఆధ్వర్యంలో ఆర్టీసిలో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసి ఉద్యోగులు మంగళ వారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసిలోని ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేటు ఆపరేటర్లకు ఇవ్వకుండా ఆర్టీసి ద్వారానే నిర్వహించాలని కోరారు. ఆర్టీసిలో ఉన్న పదివేల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, స్త్రీశక్తి పథకం కోసం 4వేల కొత్తబస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి ఉద్యోగులకు విలీనానికి ముందు ఉన్న పాత విదానంలో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్యసౌకర్యాలు అందించాలన్నారు. 11వ పిఆర్‌సి డిఏలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లోని డిఏ, ఐఆర్‌లను ప్రకటించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సమస్కులు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో నిరసనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో సెక్రటరీ వెంకటేశ్వర్లు,అధ్యక్షులు వివి.రెడ్డి ఈయూ అధ్యక్షులు జ్ఞానేష్‌కుమార్,ఎన్ఎంయూఏ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గ్యారేజ్ సెక్రటరీ కలాం టిఎన్‌టియూసి జివిరావు, యూనియన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



## గజవాహనంపై జగన్మాత చాముండేశ్వరి వైభోగం

**- కనులపండువగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు**

**- పురవీధుల్లో విహరించిన జగన్మాత.. తరలివచ్చిన భక్తులు- ఉభయకర్తలుగా చిల్లర సోదరులు**

**ఇందుకూరుపేట, జూన్ 23, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారు విశేష అలంకరణలో గజవాహనంపై అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాటాలు, భజనల నడుమ అమ్మవారి పురవీధి మహోత్సవం కనులపండువగా సాగింది. గ్రామంలోని పురవీధుల గుండా సాగిన ఈ శోభాయాత్రలో భక్తులు ఇళ్లకు ముంగిట కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో విశేష పూజలు బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఉదయం నుంచే చాముండేశ్వరి దేవికి అర్చకులు శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గంగపట్నంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల శివనామస్మరణలు, చాముండేశ్వరి నామ జపంతో మారుమోగింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉభయకర్తలుగా చిల్లర సోదరులు ఈ రోజు జరిగిన గజవాహన సేవకు ఉభయకర్తలుగా చిల్లర సోదరులు వ్యవహరించారు. వారు అమ్మవారికి పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రముఖుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, కార్యనిర్వహణ అధికారి (ఈఓ) తాతా శ్రీనివాసరావు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా, వైభవంగా జరిగేలా కమిటీ సభ్యులను సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు గుండాల మాధవరెడ్డి, మారుబోయిన జనార్దన్ గౌడ్, బొడ్డుకూరు సుధీర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, సేవకులు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎక్కడికక్కడ తీర్థప్రసాదాల వితరణ చేశారు.



## సీపీఎస్ ఉద్యోగలకు ప్రభుత్వం తీపి కబురు

## యూటిఎఫ్ సాధించిన విజయం

**కోట,జూన్ 23 ప్రభాతవార్త :** ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందిని కోట మండల యూటిఎఫ్ అధ్యక్షులు మువ్వల మనోహార్ చెప్పారు. ఆయన మంగళవారం రాత్రి కోట మండల విద్యానగర్‌లోని విలేకర్లతో మాట్లాడుతూ వెటరన్ ,ఫ్యామిలీ సీపీఎస్ కంట్రీబ్యూషన్ పై స్పష్టత ఇచ్చిందని పేర్కొన్నారు. ఉగ్యోగులకు గ్రాట్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజారు చేయాలని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయ మన్నారు. 2003 నోటిఫికేషన్ ద్వారా డిఎస్‌సి లో ఉపాధ్యాయుగా చేరిన వారికి సిపిఎస్ వర్తిస్తుందని చెప్పారు.రాష్ట్రంలో 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు లబ్ది చేకూరతుందన్నారు. .జివో నంబర్ 57 అమలు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగ సంఘాల హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఇది పూర్తిగా యూటిఎఫ్ అనేక పోరాటాల వలన సాధించిన విజయమని మనోహార్ పేర్కొన్నారు. ఆమేరకు సీఎం, చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్కు ఏర్పాటు కు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మేల్యే

**కలువాయి జూన్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కలువాయిలో తెలుగుగంగ అతిధి గృహం నందు నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ప్రజల సౌకర్యార్థం పార్కు ఏర్పాటుకు మంగళ వారం పార్టీ మండల కన్వీనర్ చల్లా రఘరామిరెడ్డి నాయకులతో కలిసి వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కి ప్రజలు ఇచ్చిన వినతి మేరకు నిరుపయోగంగా ఉన్న తెలుగుగంగ అతిధి గృహంలోని కొంత స్థలాన్ని పార్కు,వాకింగ్,వ్యాయమం, అవసరాల నిమిత్తం స్థలాన్ని పరిశీలించడం జరిగిందని ఎమ్మేల్యే రామకృష్ణ తెలిపారు.అనంతరం స్థలాన్ని పరిశీలించినజిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారి వసుమతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలుగుగంగ అతిధి గృహంలోని కొంత స్థలాన్ని పంచాయితీకి కేటాయించి పార్కు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టనున్నట్లు డిపిఒ వసుమతి తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఒ శైలజా ,పంచాయితీ అధికారులు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## అంగన్వాడి కార్యకర్తల, హెల్పర్‌ల నియామక ఇంటర్వ్యూలు వాయిదా

**- జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిక అధికారిణి హేనా సృజన్**

**నెల్లూరు సిటీ, జూన్ 23, ప్రభాతవార్త :** నెల్లూరు డివిజన్ పరిధిలోని మండలాలలో ఈ నెల 27న నిర్వహించవలసి ఉన్న అంగన్వాడీ కార్యకర్తల, హెల్పర్‌ల నియామక ఇంటర్వ్యూలు కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయబడినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిక అధికారిణి హేనా సృజన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూల నిర్వహణకు సంబంధించిన తదుపరి తేదీలను త్వరలో ప్రకటించనున్నామని, అభ్యర్ధులకు సంబంధిత అధికారుల ద్వారా మరియు పత్రికా ప్రకటనల ద్వారా సమాచారం అందజేయబడుతుందని ఆమె పేర్కొన్నారు. అందువల్ల అభ్యర్ధుల ఎదరూ ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ప్రాజెక్టు డైరెక్టర్ హేన సృజన్ తెలిపారు.



## బారా షాహిద్ దర్గా రొట్టెల పండగకు పటిష్టమైన భద్రత

**- జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల సమీక్ష**

**నెల్లూరు క్రైం, జూన్ 23, ప్రభాతవార్త:** ప్రసిద్ధిగాంచిన బారా షాహిద్ దర్గా రొట్టెల పండగను అత్యంత పకడ్బందీగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ పండగ బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. లక్షలాది మంది భక్తులే లక్ష్యంగా భద్రతా ప్రణాళిక కులమతాలకు అతీతంగా, లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ వేడుకలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణే ధ్యేయంగా ఈ సమావేశంలో చర్చించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్. సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్ష, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తదితర అధికారులు బందోబస్తు సెక్టార్లు, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ జోన్లు ఇతర సున్నితమైన ప్రాంతాల భద్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, వేడుక ప్రశాంతంగా సాగడానికి ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. దర్గా ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. క్విక్ రెస్పాన్స్ టీమ్స్, బాంబ్ డిటెక్షన్ టీమ్స్, డాగ్ స్క్వాడ్లను వినియోగించుకోవాలని సూచించారు. మిస్సింగ్ పిల్లల కోసం ఐడి ట్యాగ్స్ ఏర్పాటు, వృద్ధులు, దివ్యాంగులకు ఘాట్ వద్ద రొట్టెల మార్పిడి సమయంలో పోలీస్ సేవాదళ్ ద్వారా ప్రత్యేక సహాయం వంటి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఘాట్ ఏరియా, బోటింగ్ పాయింట్ల వద్ద లైఫ్ సేవింగ్ పరికరాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ట్రాఫిక్ సమస్యలు రాకుండా పటిష్టమైన పార్కింగ్, రూట్ మ్యాప్‌ల అమలుపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. గంధం ఊరేగింపు మరియు క్యూ లైన్ల నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తులో పాల్గొనే సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఏవీ అప్పారావు, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, హోంగార్డ్ యూనిట్ డీఎస్పీ రామకృష్ణ, వివిధ ప్రాంతాల సీఐలు,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## భారీ చోరీ కేసును ఛేదించిన వేదాయపాలెం పోలీసులు

**- రూ.11.88 లక్షల విలువైన సొత్తు రికవరీ**

**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త - క్రైం, :** నెల్లూరు నగర పరిధిలోని వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.11.88 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతోనే చోరీలను వృత్తిగా ఎంచుకున్న వ్యక్తి చివరకు మరోసారి కటకటాల పాలయ్యాడు. నెల్లూరు రూరల్ మండలం, రెవెన్యూ కాలనీలోని ఒక మూడు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న యజమానులు తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గ్రిల్ గేటు, కిటికీలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య దిశానిర్దేశం, టౌన్ ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో వేదాయపాలెం సీఐ శ్రీనివాస రావు నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో, ఈ నెల 22న బుజబుజ నెల్లూరు హైవే రోడ్డుపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పు శివనారాయణ అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా, చోరీకి గురైన సొత్తు బయటపడింది. నిందితుడి వద్ద నుండి సుమారు 162.5 గ్రాములు (విలువ రూ.11,37,500) సుమారు 340 గ్రాములు (విలువ రూ.51,000) వెరసి మొత్తం రూ.11,88,500 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అతి తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన ఆస్తిని పూర్తిగా రికవరీ చేసిన టౌన్ ఏఎస్పీ దీక్షను, వేదాయపాలెం సీఐ శ్రీనివాస రావు ఇతర పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



## అసుపత్రులలో పారిశుద్ధ్య నిర్వహణపై తనిఖీ

**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 23 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ స్థానిక పోగతోట ప్రాంతంలోని వివిధ అసుపత్రులలో పారిశుద్ధ్య నిర్వహనను డిఎంహెచ్ఓ డాక్టర్ సుజాత,ఎంహెచ్ఓ డాక్టర్ దినేష్‌లతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులు ఉండే పోగతోట ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గాలేదని ఆసుపత్రుల నుంచి వ్యర్థాలను చెత్తసేకరణ వాహనాలకు అందజేయకుండా బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ ఆనుమతులు లేకుండా ఆసుపత్రులను ఏర్పాటు చేయడంతో ఆసుపత్రులలో కనీసం పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మాణాలు జరిపి ఉన్నారని తెలిపారు. రోడ్లపై వారికి సంబందించిన వాహనాలను ఆసుపత్రి యాజమాన్యం పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయాలకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లనున్నామని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు వారి సహాయకులకు అసౌకర్యం లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మేయర్ ప్రకటించారు. జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అదికారి డాక్టర్‌సుజాత మాట్లాడుతూ పరిసరాల పరిభుభ్రపై నిర్లక్ష్య వహిస్తున్న ఆసు పత్రులపై నోటీసులను జారీ చేయనున్నామని తెలిపారు. కార్పోరేషన్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అసుపత్రులను గుర్తించి సంబందిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేయనున్నామని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో పరిశుభ్రతంగా లేకపోవడం, చెత్తచెదారంతో నిండుకోవడం వంటి ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, శానిటేషన్ సూపర్‌వైజరు ఆశీర్వాదం, డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రఘురాం, టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారులు వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆరోగ్యంపై సిటీ టాస్క్‌పోర్స్ సమావేశం

**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 23 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం పల్స్‌పోలియో కార్యక్రమం గురించి మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వైఓ.నందన్‌ల అధ్యక్షతన జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాకటర్ ఉమామహేశ్వరి, మున్సిపల్ కార్పోరేషన్ మలేరియా అధికారి డాక్టర్ జిజియా బాయి, నగర పాలకసంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దినేష్‌ల ఆధ్వర్యంలో సిటీటాస్క్‌పోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 28న ఆదివారం నుంచి 30వవరకు పల్స్‌పోలియా కార్యక్రమం ఉన్నందున మున్సిపల్‌కార్పోరేషన్ పరిధిల రైల్వే స్టేషన్, బస్టాండ్లు రద్దీ కారణంగా వివిద ప్రాంతాలలో 21ట్రాన్సిట్‌పల్స్‌పోలియో బూతులు ఏర్పాటు చేస్తారని అర్బన్ ఆరోగ్యకేంద్రాల పరిధిలో 382 ఫిక్స్ బూతులు ఈయొక్క బూతులలో వ్యాక్సిన్ సరఫఱా చేసేందుకు సూపర్‌వైజర్లు ద్వారా 41రూట్లలో వాహనాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 28న జరిగే పల్స్‌పోలియా కార్యక్రమంలో 0నుంచి 5ఏళ్ళ లోపు 91641మంది పిల్లలను గుర్తించామన్నారు. పిల్లలందరికి పోలియో చుక్కలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అలాగే ట్రాన్సిట్ బూతులు ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలను గుర్తించి వారికి పోలియోచుక్కలు అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, డిపిఎంఓ అనూ రాధ, నోడల్ ఆఫీసర్ మహిళా శిశుసంక్షేమ శాఖ అరుణ, సిడిపిఓ నెల్లూరు అర్బన్ సుధాకర్‌రావు, పరిపానాధికారి మెప్మా అశోక్ డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నెల్లూరు పట్టణ పరిధిలోని అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



## రాబోయే రోజుల కోసం మాస్టర్‌ప్లాన్ రూపకల్పన

**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 23 ప్రభాతవార్త :** రాబోయే రోజుల్లో దృష్టిలో పెట్టుకొని నుడా ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్వీ అసోసియేట్ ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్ మీటింగ్ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైస్‌ఛైర్మెన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2200 కిలోమీటర్లు విస్తీర్ణానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు నుడా ఛైర్మెన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు.నుడా ఛైర్మెన్ మాట్లాడుతూ తొలిదశలో 23 మండలాలకు గానూ 3 మండలాలకు స్టేట్ హోల్డర్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేల సూచనలు, సలహాలు తీసుకొని ఫైనల్‌ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రహదారులు పరిరక్షించాల్సిన ప్రాంతాలు జల వనరుల నివాస ప్రాంతాలు వాణిజ్య మరియు వ్యాపార ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌ను రూపొందించామన్నారు. భవిష్యత్తులో పెరిగే జనాభాను వారి వసతులను దృష్టిలో పెట్టుకొని మాస్టర్‌ప్లాన్ రూపొందించామని వెల్లడించారు. మాస్టర్‌ప్లాన్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలలో ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక అధికారులు తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు. నెల్లూరు రూరల్‌తో పాటు బుచ్చిరెడ్డిపాలెం కావలి మండలాలపై ప్రధాన దృష్టి పెట్టామన్నారు. ఈ సమావేశంలో నుడా అధికారులు పాల్గొన్నారు.



## సంయుక్త కమిటీ సమావేశంలో ఎంపి బిఎంఆర్

**కావలి, జూన్ 23 ప్రభాతవార్త :** కార్పోరేట్ చట్టాల సవరణ బిల్లు 2026పై రాజ్యసభ సభ్యులు బీదమస్తాన్‌రావు యాదవ్ మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంటుహోస్ అనెక్స్‌లో నిర్వహించిన సంయుక్త కమిటీ సమావేశంలో ఇంటర్‌నేషనల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్స్ అధారిటీ గిఫ్ట్ సిటీ, కేంద్ర ఆర్ధిక మంత్రిత్వశాఖ రెవెన్యూ విభాగం సెంట్రల్‌బోర్డు ఆఫ్ డైరెక్టర్ టాక్సెస్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ అండ్ కస్టమ్స్ వాణిజ్య మంత్రిత్వశాఖ పర్‌ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ట్రేట్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ పారెన్ ట్రెడ్ ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు కమిటీకి తమ అభిప్రాయాలు, సూచనలు, ప్రజెంటేషన్లు చేశారు. వివిధ సంస్థల ప్రతిపాదనలు అభిప్రాయలను పరిశీలసూ కార్పోరేట్ రంగంలో పారదర్శకత పెట్టుబడుటు ప్రోత్సాహం, వ్యాపార సౌలభ్యం దేశ ఆర్థికాభివృద్దికి తోడ్పడే విధంగా చట్ట సవరణలపై చర్చల్లో పాల్గొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించే దిశగా కార్పోరేట్ చట్టాల సవరణకు సంబంధించి కమిటీ సమగ్రంగా పరిశీలన కొనసాగిస్తుందని తెలిపారు.



## శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

**ఉదయగిరి, జూన్ 23, ప్రభాతవార్త :** డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయగిరి మండల బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్ర దేశ సమైక్యత కోసం ఒకే జెండా ఒకే చట్టం నినాదంతో 370 రద్దు కోసం ఆయన చేసిన కృషి మొట్టమొదటిదని జాతీయ భావజాలం ఆయన చేసిన త్యాగాలు ఆదర్శమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాం ప్రసాద్ సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఆయన ఆశ సాధన కోసం కృషి చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల ప్రధాన కార్యదర్శులు మాధవరెడ్డి, శ్రీహరి కైలాస కోట సుధీర్, రాము, డాక్టర్ వెంకట రమేష్‌బాబు, వల్లభ అఖిల్, పవన్ కళ్యాణ్, శ్రీరాములు, రేష్మ, సూర్య, ఆదిత్య, పెద నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




**గౌరవనీయులైన డెట్స్ రికవరీ ట్రిబ్యునల్**
**విశాఖపట్నం వారి సమక్షంలో**

ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము
(గ్రౌండ్ & 1వ అంతస్తు, 31-31-21, సాయి బాబా వీధి,
నారాయణ భవన్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.

**O.A No. 475/2026**

కెనరా బ్యాంక్, నెల్లూరు మెయిన్ బ్రాంచ్, SPSR నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524001.
... దరఖాస్తుదారుని బ్యాంక్

మరియు
1. వెంగమాంబ స్వశక్తి గ్రూప్, సంతపేట, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా-524002.
2. బి. ఇందుమతి
3. టి. నవీన
4. జి. ప్రసన్న
5. టి.గుణప్రియ
6. Sk. నబీనా
7. Md. నవ్య
8. బి. దుర్గా దేవి
9. సిహెచ్. జయ నారాయణమ్మ
10. బి. దివ్య భారతి
11. Sk. నిధా పర్వీన్ ... ప్రతివాదులు

**పత్రికా ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు**

ప్రతివాదులు
D1. వెంగమాంబ స్వశక్తి గ్రూప్, సంతపేట, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా-524002.
D2. భవానీ ఇందుమతి, భర్త: ముని కుమార్, 19-6-163, కాపులి వీధి, కోట మిట్ట, నెల్లూరు-524001.
D3. తలపాల నవీన, తండ్రి: తిరుపాలు, 12/12/52, పోలుకట్ట, సుందరయ్య నగర్, నెల్లూరు-524001.
D4. గణేశం ప్రసన్న, భర్త: హజరత్ రెడ్డి, 4-8-94, FCI కాలనీ, వాటర్ ట్యాంక్, నవాబ్‌పేట, నెల్లూరు-524002.
D5. తలపాల గుణప్రియ, తండ్రి: తిరుపాలు, 12/12/52, పోలుకట్ట, సుందరయ్య నగర్, నెల్లూరు-524001.
D6. షేక్ నబీనా, తండ్రి: మహబూబ్ బాషా, 20-4-202, పెద్ద బజార్, సిటిజన్ పబ్లిక్ స్కూల్ దగ్గర, నెల్లూరు-524004.
D7. మహ్మద్ నవ్య, తండ్రి: వెంకటేశ్వరరావు బుడ్డి, సుందరయ్య నగర్, నెల్లూరు.
D8. భవానీ దుర్గాదేవి, తండ్రి: ముని కుమార్, 19-6-163, కాపులి వీధి, కోట మిట్ట, నెల్లూరు-524001.
D9. సిహెచ్. జయ నారాయణమ్మ, భర్త: ప్రసాద్, A27, G6, TIDCO అపార్ట్‌మెంట్స్, వెంకటేశ్వర పురం, నెల్లూరు-524005.
D10. బూడంగుంట దివ్య భారతి, తండ్రి: మురళీకృష్ణ, విఘ్నేశ్వరపురం, కుక్కలగుంట, నెల్లూరు-524001.
D11. షేక్ నిధా పర్వీన్, తండ్రి: మహబూబ్ బాషా షేక్, 5-1-36, టైలర్స్ కాలనీ, 2 వీధి, మసీదు, కొత్తూరు బిట్ 1, నెల్లూరు-524004.

OA No.475/2026 గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి/రిజిస్ట్రార్ ముందు తేది.17-07-2026 న లిస్ట్ చేయబడినది.

గౌరవనీయ ట్రిబ్యునల్ సెక్షన్ 19(4) క్రింద పేర్కొన్న దరఖాస్తుపై సమన్లు/నోటీసులు జారీచేయబడ్డాయి. (OA) క్రింద రూ. 20,65,823.23 పై ఋణాల రికవరీ కొరకు దావా మీకు వ్యతిరేకంగా దాఖలు చేయబడ్డాయి.
1. చట్టంలోని సెక్షన్ 19, సబ్ సెక్షన్ (4) ప్రకారం మీరు ప్రతివాదులు ఈ క్రింది విధంగా నిర్దేశించబడ్డారు:
2. సమన్లు అందిన ముప్పై రోజులలోపు, కోరిన ఉపశమనాన్ని ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి;
3. అసలు దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు మరియు ఇతర యాజమాన్యాలు కాకుండా ఇతర ఆస్తుల వివరాలను బహిర్గతం చేయడం;
4. అసలైన దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద బహిర్గతం చేయబడిన సెక్యూర్డ్ ఆస్తులు లేదా అటువంటి ఇతర ఆస్తులను అమ్మకం చేయడం లేదా ఇతర క్రయ వ్యవహారాల నుండి మీరు నిరోధించబడ్డారు. ఆస్తుల జోడింపు కోసం దరఖాస్తు యొక్క విచారణ పెండింగ్‌లో ఉంది;
5. సురక్షితమైన ఆస్తులు లేదా ఇతర ఆస్తుల మరియు ఆస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అటువంటి విక్రయ ఆదాయాన్ని బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల వద్ద సెక్యూరిటీ వడ్డీని కలిగి ఉన్న ఖాతాలో జమ చేయాలి.

మీకు దరఖాస్తుదారు అందించిన దావా యొక్క కాపీతో వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌ను ఫైల్ చేయాలని మరియు తేది.17-07-2026 న ఉదయం 10:30 ని॥లకు ప్రిసైడింగ్ ఆఫీసర్ ముందు హాజరు కావాలని కూడా మీరు నిర్దేశించబడ్డారు. మీరు దరఖాస్తు చేయుటలో విఫలమైతే మీ గైర్హాజరు సమయంలో నిర్ణయం తీసుకోబడుతుంది.

నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది 22 జూన్ 2026 న విశాఖపట్నం వద్ద జారీచేయబడినది.

రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం

## వైభవంగా ప్రారంభం అయిన శ్రీ ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాలు



**సంగం జూన్ 23 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో ప్రారంభం అయ్యాయి. సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారిని దర్శించుకుంటే భద్రా చలంలో భద్రాది రాముడ్ని దర్శించుకు న్నంత అనుభూతి కలుగుతుందని భక్తులు అపారనమ్మకం. 24వ తేది ద్వజారోహ ణం, శేషవాహనం, 25వ తేదిహంసవా హనసేవ, 26 వ తేది వ్యాళివాహనసేవ, 27 వ తేది హనుమంతసేవ, 28వ తేది గరుడసేవ, 29వ తేది కళ్యాణం, గజవాహనసేవ, 30 వ తేది రథోత్సవం, రాత్రికి చంద్రప్రభవాహనం, జులై1వ తేది పొన్నమానుసేవ, 2వ తేది ధ్వజఅవరోహణం, అలకలతోపు, 3వ తేది ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. దేవస్థానం అభివృద్ధికి సహకరించిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కమీటి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమాలను సహాయ కమీషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి చిల్లకూరు వరప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించనున్నారు. పూజా కార్యక్రమాలను వేదగిరి సత్యనారాయణ చార్యులు, దివి రాజ్‌కుమార్ నిర్వహించనున్నారు.

## 254 ఏళ్లు చరిత్ర కలిగిన దర్గాను సందర్శించిన అజీజ్





**కోవూరు, జూన్23 ప్రభాతవార్త** : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని గురున్‌షా ఔలియా దర్గా 254 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందని, ఈ దర్గాను సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. మంగళవారం ఈ దర్గాను వక్ఫ్‌బోర్డ్ సీఈవో ఎస్‌కే యాకూబ్ బాషా, వక్ఫ్‌బోర్డ్ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దర్గాకు 1400 ఎకరాలకు పైగా పొలాలు ఉండేవని, ప్రస్తుతం అవన్నీ అన్యాక్రాంతం అయ్యాయన్నారు. ప్రస్తుతం 87 ఎకరాలుగుర్తించి అందులో 54 ఎకరాలను కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో సర్వేయర్ రమేష్ గౌడ్‌లు నిశిత పరిశీలన చేపట్టి త్వరలో స్వాధీనం చేసేలా చర్యలు చేపట్టనున్నారన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిగానీ, వక్ఫ్‌బోర్డ్ సంబంధించిగానీ ఆస్తులు ఉన్నా, భూములు ఉన్నా అవి దేవుడికే చెందుతాయి తప్ప అన్యులకు చెందవన్నారు. ఈ దర్గాకు సంబంధించిన ఆస్తులను దర్గా అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తమకు పలుకుబడి ఉంది కదా అని అన్యాక్రాంతం చేసుకుంటే చివరకు అవి దేవుడికే చెందుతాయన్నారు. వాస్తవంగా వక్ఫ్‌బోర్డ్ స్థలాలను ఎవరు కొనుగోలు చేయడం, అమ్మడం నిషిద్ధమన్నారు. కొంతమంది దొంగతనంగా ఈ భూములు అమ్మినా..ఆ స్థలాలు మాత్రం చివరకు వక్ఫ్‌బోర్డ్‌కు చెందుతాయి తప్ప అన్యాక్రాంతం కానివ్వమన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ దర్గాకు చెందిన ఆస్తులను తిరిగి చెల్లిస్తే వారికే మంచిదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా అధ్యక్షుడు మహమ్మద్, మైనార్టీ నాయకులు జమీర్, సాధిక్, సమీర్, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





**కోవూరు, జూన్23 ప్రభాతవార్త** :ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల సవరణపై చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కలిసి ఒక్క ఓటు పోకుండా దృష్టి పెట్టాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి అన్నారు. కోవూరులోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మంగళ వారం కోవూరు నియోజకవర్గ బీఎల్ఏ-1 శిక్షణ కార్యక్రమాన్నిచేపట్టారు. మాట్లాడు తూ బీజేపీ పార్టీకి సంబంధించిన బీఎల్ఏలు ఓటర్ లిస్టులో చేర్పులు, మార్పులు కొత్తగా ఓటు నమోదు కా ర్యక్రమాన్ని దగ్గరుండి నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకుండా ప్రతి బీఎల్ఏ వారికి కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలో పారదర్శకంగా తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వహించాలన్నారు. కోవూరు నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్ర మాట్లాడుతూ భారతప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బీఎల్ఏలు వారి వారి పోలింగ్ బూత్ పరిధిలోని బీఎల్‌వోలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఫారాల పంపిణీలో పాల్గొని అవసరమైన వారికి అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి రఘురామయ్య, సీనియర్ నేత మారుబోయిన శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసుబ్బారావు, బుచ్చి అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్, బుచ్చి రూరల్ అధ్యక్షుడు సిద్ధన మనోహర్‌రెడ్డి, కొడవలూరు అధ్యక్షుడు ఎం. శివకుమార్, విడవలూరు అధ్యక్షుడు కొమ్మిరెడ్డి కోటారెడ్డి, తదితరులు ఉన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి





**కోవూరు, జూన్23 ప్రభాతవార్త** : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అందించే ఏజెన్సీలు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయడమే కాకుండా విద్యార్థులకు అందించే భోజనంలో పౌష్టికాహార పాళ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వారి బిడ్డలు తినేలా సహకరించాలన్నారు.

**- విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి** ప్రాథమిక దశ నుంచే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు అన్నారు. ఈ మేరకు ఆయన ప్రధానోపాధ్యాయిని కార్యాలయంలో ప్రత్యేకంగా పీఎంశ్రీ పథకంపై సమీక్షించారు. పీఎంశ్రీ పథకం కింద ఏ మేరకు నిధులు వచ్చాయి.. వాటిని ఏయే విధంగా వ్యయం చేశారనే విషయాలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ ద్వారా తెలుసుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పీఎంశ్రీ పథకానికి సంబంధించి ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి దానికి సంబంధించిన వివరాలను పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వీపీఆర్ నేత్ర సేవలు అమోఘం



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త** : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిల సహకారంతో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర సేవలు మంగళవారం కోవూరు మండలం పడుగుపాడుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెంచలయ్య మాట్లాడుతూ వీపీఆర్ దంపతులు రాజకీయాలకు రాకమునుపే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. ప్రస్తుతం వీపీఆర్ నేత్ర ద్వారా పేద ప్రజలకు ఉపయోగపడే సేవలు చేస్తున్నారని, ఇదే సేవలు బయట చేసుకుంటే వేలాది రూపాయలు పెట్టాల్సి వస్తుందన్నారు. అవసరమైన వారికి అరగంట లోనే నాణ్యమైన కంటి అద్దాలు కూడా వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నారన్నారు. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న వీపీఆర్ దంపతులు మన జిల్లాకు దొరకడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్ యాదవ్, శ్రీనివాసులు నాయుడు, ఫిరోజ్ ఖాన్, బాలకృష్ణ, పెద్ద సంఖ్యలో నేతలు ఉన్నారు.



## ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించిన జేసీ



**కోవూరు, జూన్23 ప్రభాతవార్త** : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న పౌర సరఫరాల శాఖ గోదామును మంగళవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోదాములోని రేషన్ సరుకులను పరిశీలించి స్టాక్ వివరాలను సివిల్ సప్లయిస్ డీటీ బాలకోటమ్మను ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గోదాములోని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గోదాముల ద్వారా 152 చౌక డిపోలకు రేషన్ సరుకులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా బియ్యం అక్రమ రవాణా జరిగితే వాటని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సీజ్ చేసిన స్టాక్ వివరాలను ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో పొందుపరచడం జరిగిందని, కమిటీని ఏర్పాటు చేశామని, ఆ నివేదిక ప్రకారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

## సర్ ప్రక్రియపై అధికారుల అలసత్వం వీడాలి



**కావలి, జూన్ 23 ప్రభాతవార్త** : కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక నిశిత ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంపై క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం ప్రదర్శించడం సరికాదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళశారం స్తానిక బిజెపి ఒకటవ పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారదర్శకమైన తప్పులేలేని ఓటర్ల జాబితా రూపొందించేందుకే ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. డోర్ టు డోర్ సర్వే సక్రమంగా జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనిర్లక్ష్యం కారణంగా అర్హులైన కొత్త ఓటర్లు, ముఖ్యంగా యువత, ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి నియోజకవర్గంలో సర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్య వహించే సిబ్బందిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని క్రిష్ణ చతైన్య విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలను రాజకీయ రంగు పులుమడం సరికాదని అన్నారు. అధికారులు తనిఖీలు చేసేందుకు వెలితే ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి తగదన్నారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ అయినా, విద్యార్థుల భద్రతకు సంబంధించిన తనిఖీలు అయినా ప్రజాప్రయోజనాల కోసం నిర్వహించబడుతున్నాయని వాటిపై అవసరమైన రాజీకయ విమర్శలు చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్, జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యఓఉలు పరుసు వెంకటేశ్వర్లు, ఓబీసీ జిల్లా నేత వల్లపు తిరుపతయ్య, నెల్లూరు సుభాష్, మెదరమెట్ల మణిదీప్, దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగం బ్యారేజి వద్ద పొర్లు కట్టలు ఇతర పనులకు 1.99 కోట్లు



**సంగం జూన్ 23 ప్రభాతవార్త** సంగం బ్యారేజి వద్ద దెబ్బతిన్న పొర్లు కట్టలు వరద కట్టలు తదితర మరమ్మత్తుల కోసం 1.98 కోట్లు 95 వేల 377 వ్యవయంతో పనులకు పరిపాలనా అనుమతులు లబించినట్లు తెలుగుగంగ ఈఈ అనీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. బ్యారేజిని సందర్శించిన ఆయన మాట్లాడుతు బెడ్‌పిచింగ్ పునరుద్దరణ, పెన్నానది ఎడమ గట్టు రక్షణ, రహదారి మరమ్మత్తులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి నీర్ణిత గడవులో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరిగేషన్ అదికారులున్నారు.

## ఇంజనీరింగ్ డిప్లమా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



**కావలి, జూన్ 23 ప్రభాతవార్త** : ఇటీవల విడుదలైన ఇంజనీరింగ్ డిప్లమా ఫలితాల్లో రుద్రకోటకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచారు. ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు, జిల్లా,రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదువుతున్న సందీప్ అనే విద్యార్థి 1000మార్కులకు 991 మార్కులు సాధించి రాష్ట్రస్తాయిలో ప్రతిభ చాటాడు. ఈసెట్ 2026లో ఈ విద్యార్థి 22వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. హేమంత్‌కుమార్ 915, ఎం.శ్రీకాంత్ 913, సంతోష్ 913, భావన 901 మార్కులుసాధించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల్‌కుమార్ ప్రియ మాట్లాడుతూ అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఈ అద్భుత ఫలితాలు సాధించగలిగామన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే మా లక్ష్యం

**- జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్ర**



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త - వైద్యం** గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే మా లక్ష్యమని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్డీఎస్ఎస్ పథకం కింద జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే. రాఘవేంద్రం జలదంకి, అన్నవరం సబ్ స్టేషన్లలో కొత్త ఫీడర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలదంకి సబ్ స్టేషన్‌లో ప్రారంభించిన ఆర్డీఎస్ఎస్ ఫీడర్ ద్వారా 9వ మైలు, హనుమకొండపాలెం, చిన్నక్రాక ఎస్సీ కాలనీ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుందన్నారు. దీంతో లో వోల్టేజ్ సమస్యలు తగ్గి, విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉండనుందన్నారు. అలాగే అన్నవరం సబ్ స్టేషన్‌లో ప్రారంభించిన ఆర్డీఎస్ఎస్ ఫీడర్ ద్వారా అన్నవరం, గట్టుపల్లి, గట్టుపల్లి చింతలపాలెం మరియు గోపన్నపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నకాక గ్రామంలో స్థానిక సమస్యలు మరియు గ్రామస్తుల నుంచి వచ్చిన చిన్న చిన్న అభ్యంతరాల కారణంగా ఆర్డీఎస్ఎస్ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కావలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బెనర్జీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్, కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరందామయ్య, కన్‌స్ట్రక్షన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**- ఏఓ సుచేంద్రప్రసాద్**



**కోట, జూన్ 23 ప్రభాతవార్త** ఎల్‌నినో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు అప్రమత్తంగా ఉండాలని కోట మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకన్నపాలెం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని గురించి ఎపిఎఐఎంఎస్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా డీఏపీ ఎరువులను ఇస్తుందని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం, నేరుగా సాగు చేస్తున్న రైతులకు ఎరువులను అందించడం ఈ యాప్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ యాప్ ద్వారా భూ యజమానులు, రైతులు, వెబ్ ల్యాండ్‌లో నమోదు కాని రైతులు, ఆర్ఓఎఫ్ రైతులు, ఆక్వా రైతులు, రీసర్వే గ్రామాల రైతులు కూడా ఎరువులు పొందే అవకాశం ఉందని తెలిపారు. వరి సాగు చేసే ప్రతి రైతుకు ఎకరాకు మూడు బస్తాలు చొప్పున మూడు విడతల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతులు తాము కోరుకున్న దుకాణం నుంచి ఎరువులను తీసుకోవచ్చన్నారు. పంటల దిగుబడి కోసం ఇష్టానుసారంగా ఎరువులను వినియోగించవద్దని సూచించారు.

## జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని నెల్లూరు పర్యటన



**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త - కలెక్టరేట్** జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని ఈ నెల 24వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆమె జూన్ 23న న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అనంతరం జూన్ 24న ఉదయం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం నెల్లూరుకు చేరుకుంటారు. అదే రోజు రాత్రి నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం చేయనున్నారు.





## సుందరయ్య పార్కు.. రాజకీయ చిక్కుల్లో!

### విడవలూరులో అసంపూర్తిగా మిగిలిన మహనీయుడి స్మృతివనం

### ఉపాధి హామీ నిధులు మంజూరైనా ఆగిన నిర్మాణం





**విడవలూరు, జూన్ 23 ప్రభాతవార్త** : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అలగానిపాడు ముద్దుబిడ్డ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో విడవలూరు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయ తలపెట్టిన పార్కు పనులు రాజకీయ చిక్కుల్లో చిక్కుకుపోయాయి. 2019లో పంచాయతీ అనుమతితో ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నేటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. నిధులు మంజూరైనా.. నిలిచిన పనులు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు ..38,412 నిధులువెచ్చించి, యంత్రాలతో స్థలాన్ని సమతలీకరించారు. పార్కు చుట్టూ ఫినిషింగ్ రాళ్ల ఏర్పాటు చేసి, స్థానిక మధ్యతరగతి ప్రజల అవసరార్థర రచ్చబండ నిర్మాణానికి కూడా సన్నాహాలు చేపట్టారు. 15 పంచాయతీల ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో పనులు ప్రారంభమె నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో అడ్డంకులు మొదల య్యాయి. సచివాలయంతో వివాదం పార్కు కోసం కేటాయించిన స్థలంలోనే సచివాలయం నిర్మిం చాలని గత ప్రభుత్వం నిర్ణయించడంతో వివాదం రాజుకుంది. దౌర్జన్యంగా పునాదులు వేసి బేస్ మట్టం వంకు పనులు చేపట్టడంపై స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం జోక్యంతో పనులు నిలిచి పోయాయి. ఈ క్రమంలో పార్కు ఏర్పాటుకు మద్దతు తెలిపిన కొందరు అధికారులను బదిలీ చేసినట్లు అప్పట్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. స్పందించాలని ప్రజల విజ్ఞప్తి మహనీయుడి స్మృతివనం నిర్మాణం నిలిచిపోవడం బాధాకరమని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించి, నిలిచిపోయిన సుందరయ్య పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. పేదరికంలో పుట్టి, "కులం-మతం లేదు, అందరం ఒకటే" అనే భావనను జీవితంలో ఆచరించి చూపిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో పార్కు ఏర్పాటు చేయాలని అలగానిపాడు గ్రామస్తుడు, రిటైర్డ్ అధికారి నలమోలు వెంకటేశ్వర్లు కోరారు. భారతదేశ చరిత్రలో తనకం టూ ప్రత్యేక స్థానం సంపాదించిన సుందరయ్య, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఒకే నీటిని మరో బావిలో కలిపినట్లుగా అన్ని కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన నాయకు డిగా సుందరయ్య జీవితం నిలిచిందని ఆయన అన్నారు. అలాంటి మహనీయుడి పేరుతో ఏర్పాటు చేయ నున్న పార్కును సక్రమంగా అభివృద్ధి చేసి, అక్కడ ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే ఎంతో సంతోషంగా ఉంటుందని వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి : జేసీ సూచన



**లేగుంటపాడు(కోవూరు,) జూన్23 ప్రభాతవార్త** : తహసీల్దార్ కార్యాలయానికి ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని సకాలంలో పరిష్క రించేలా తగు చొరవ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి పిటిషన్‌ను సంబంధిత శాఖ అధికారులు నిశిత పరిశీలన చేపట్టి దానిని ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో పొందుపరిచి పరిష్కారం అయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటించడమే కాకుండా వారికి కేటాయించిన విధు లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 27,28,29 జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజ యవంతం చేసేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కర్యకర్తలు తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా నీటితీరువా వసూళ్లను మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్‌కు తెలిపారు. ప్రస్తుతం సచి వాలయం ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు బీఎల్‌వోలుగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ రికార్డులను నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజ గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సలీమ్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## ఉద్యోగులకు ట్రిపుల్ బోనాంజ

### ఏపీ ఎన్జీవోస్ చరిత్రలో మరో చారిత్రాత్మక మైలురాయి





**నెల్లూరు, జూన్ 23, ప్రభాతవార్త- కలెక్టరేట్** రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంపు. రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంతో సంతోష కరమైనవిషయం. జిఓఎంఎస్. 57ప్రకారం 01 .09.2004కుముందు నోటిఫై అయిన సుమారు 11,000 మంది ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేస్తున్న సుమారు 8000 మందికి పైగా పెండింగ్‌లో వున్న కొంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేసే అంశాలకు ఆమోదం లభించడం వెనక కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ నేతృత్వంలోని ఏపీ జేఏసీ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ధృడ సంకల్పంతో తీసుకుని, అలుపెరగని పోరాటం, నిరంతర ప్రయత్నాలు, అనేక స్థాయిల్లో చర్చలు మరియు సమన్వయంతో ముందుకు తీసుకువెళ్లి విజయవంతం చేసిన రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏపీఎన్‌జిజివోస్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్‌కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేగలరమణకి, రాష్ట్ర జేఏసీ నాయకత్వానికిఉద్యో గులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపట్ల అత్యంత సానుకూలంగా స్పందించి ఈచారిత్రాత్మక నిర్ణ యాలకు ఆమోదం తెలిపిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యా ణ్‌కి, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి, హెచ్ఆర్‌డీ శాఖ మంత్రి నారాలోకేష్‌కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిపీపీ జేఏసీ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా పక్షాన జిల్లా జేఏసీ చైర్మన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా జేఏసీ కార్య నిర్వాహక కార్యదర్శి జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అభివృద్ధి మా లక్ష్యం :కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్ జూన్ 23 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని కందమూరు గ్రామంలో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, బస్ షెల్టర్, కమ్యూనిటీ షెల్టర్లను తెలుగుదేశం పార్టీ రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు నంబూరు వెంకటరమణమ్మ, టిడిపి నాయకురాలు అంబూరు అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో కందమూరు గ్రామ అభివృద్ధికి రూ.5 కోట్ల 34 లక్షలు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా భావించి ముందుకు సాగుతున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు మరింత బలంగా ఉండాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను ఆశీర్వదించాలని, మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాపూరు శేఖర్, ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, టిడిపి నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.